యల నోట్లు బయటపడ్డాయి.

ఊపిరి బిగబట్టి వాటిని చూసిన మస్తాన్, "ఇంత డబ్బు నీకెక్కడిదిరా? " అన్నాడు నారాయణ నోటి మీద తన చేతిని కొద్దిగా వదులు చేస్తూ.

నారాయణకి తను వారి చక్రబంధంలో ఇరుక్కుపోయానని అర్థమైంది. వారిద్దరిలో ఏ ఒక్కరినీ తను ఒంటరిగా ఎదిరించలేడు. అలాంటిది ఇద్దరినీ కలిపి ఎదిరించటం అసాధ్యం. అందుకే పెనుగులాడటం ఆపేశాడు.

"చెప్పరా! ఎక్కడిదింత డబ్బు? " ఈసారి శంకర్ అడిగాడు.

"మీకెందుకు చెప్పాలి? " ఉక్రోషంగా అన్నాడు నారాయణ.

చెంప ఛెళ్ళుమంది శంకర్ కొట్టిన దెబ్బకి. కళ్ళ ముందు మెరుపులు మెరిసినట్లయింది నారాయణకి.

"అడిగినపుడు సమాధానం చెప్పాలి. అది మర్యాద" శంకర్ ఎందుకు కొట్టిందీ వివరించాడు.

"దొరికింది" గొణుక్కుంటున్నట్లు చెప్పాడు నారాయణ.

"ఎవడ్రా అంత డబ్బు పోగొట్టుకుంది? కనీసం ఆ ఏరియాలో ఎవరూ తమ డబ్బు పోయిందని అనుకోవటం వినలేదే"

ఆ డబ్బు తనకు ఎలా దొరికిందో వివరంగా చెప్పాడు నారాయణ.

"ఇంకా నయం! ఆకాశంలో నుండి ఊడి పడిందన్నావ్ కాదు" వ్యంగ్యంగా అన్నాడు శంకర్.

"నమ్మితే నమ్మండి. లేకపోతే లేదు. నా డబ్బులు నాకు ఇచ్చేయండి"

"డబ్బు దొరకటం ఏంట్రా? ఆ డబ్బు నీకు దొరికినట్లే ఇప్పుడు నాకు దొరికింది. ఆ డబ్బు మీద నీపేరేమన్నా రాసి ఉందా ఏమిటి? " డబ్బుంతా చక్కగా సర్దుతూ అన్నాడు శంకర్. "కావాలంటే ఈ నోటు తీసుకో" ఒక వెయ్యి నోటు తీసి ఇస్తూ అన్నాడు.

"అక్కర్లేదు. ఆ నోటేదో నువ్వే ఉంచుకో.. నాకు నా డబ్బు ఇచ్చెయ్!"

"అయితే నీ ఖర్మ!" ఆ నోటు కూడా వెనక్కి తీసుకుంటూ అన్నాడు శంకర్.

నారాయణకి అసహాయత నుండి ఉక్రోషం, ఉక్రోషం నుండి కోపం వచ్చాయి. కానీ, ఏమి చెయ్యాలో అర్థం కాలేదు. ఇంతలో అతనికి కింద పడి ఉన్న సారా సీసా కనిపించింది. కిందకు వంగి దానిని చేతిలోకి తీసుకున్నాడు. మస్తాన్ ధ్యాస అంతా శంకర్ చేతిలోని డబ్బు మీదే ఉండటంతో అతను ఈ సంగతి గమనించలేదు. అదీకాక ఈ అర్భకుడు ఎదురుతిరగగలడన్న ఊహ కూడా వారికి రాలేదు.

నారాయణకి వాళ్ళిద్దరూ నోటిదాకా వచ్చిన కూడుని తన్నుకుపోయే గద్దల్లా కనిపిస్తున్నారు. అన్నిటికీ తెగించినట్లు చేతిలోని సీసాతో అడుగు ముందుకేశాడు.

అప్పుడే అతన్ని గమనించిన శంకర్ కేక పెట్టాడు "ఏయ్! ఆ సీసా ఇటివ్వు.." అంటూ.

అప్పటికే ఆలస్యం అయింది. నారాయణ తన బలం అంతా చేతిలోకి తీసుకుని ఆ సీసాతో శంకర్ బుర్ర మీద కొట్టాడు. అంతే! శంకర్ తల రెండుగా విచ్చుకుని రక్తం ధారలుగా కారసాగింది. తలను రెండు చేతుల్తో పట్టుకుని శంకర్ మరోమాట లేకుండా కూలిపోయాడు.

నారాయణ కిందకు వంగి తన డబ్బు సంచి తీసుకుని గుడిసె నుండి బయటకు పరుగెత్తాడు.

శంకర్ తల పగిలి కిందకు కూలిపోగానే ఒక్కక్షణం ఏమి జరుగుతుందో అర్థం కాక అలానే నిలబడిపోయాడు మస్తాన్. తేరుకున్న వెంటనే అతనికి అర్థమైన విషయం



ఇప్పుడా డబ్బు తను చేజిక్కించుకుంటే దానిని శంకర్‌తో పంచుకోనవసరం లేదని. ఆ విషయం అర్థమైన వెంటనే రెట్టించిన ఉత్సాహంతో అతను నారాయణ వెంటపడ్డాడు.

నిర్మానుష్యంగా ఉన్న వీధుల్లో అడుగుల శబ్దాలు ప్రతిధ్వనిస్తుంటే మస్తాన్, నారాయణ ఒకరి వెంట మరొకరు పరుగులు పెట్టుకుంటూ ముందుకు వెళ్ళిపోయారు.

★ ★ ★

రోజంతా జరిగిన రాజకీయ చదరంగంలో తను తప్ప మిగిలిన వారందరూ 'సేఫ్' అయ్యారని నరహరికి అర్థమైంది.

ప్రస్తుతం అతను పోలీస్ స్టేషన్లో ఉన్నాడు. అతను నడుపుతున్న ఉద్యమం వలన శాంతి భద్రతలకు భంగం కలుగుతుందని ముందు జాగ్రత్త చర్యగా అతన్ని అరెస్ట్ చేశారు.

అరెస్ట్ అయితే చేశారు కానీ, వ్యక్తిగత పూచీకత్తు మీద వదిలి పెడతామన్నారు. అతను మాత్రం బయటకు వెళ్ళటానికి ఇష్టపడలేదు. నిజం చెప్పాలంటే బయటకు వెళ్ళి ఏం చేయాలో అతనికి తెలియటం లేదు. ఫ్రీ పబ్లిసిటీ కోసం అర్ధరాత్రి దాకా పోలీస్‌స్టేషన్లోనే కూర్చున్నాడు. అయినా ఎవరూ పట్టించుకోకపోవటంతో తప్పక బయటకు వచ్చాడు. అతని అనుయాయులు కొంతమంది ఇతని విడుదల కోసం ఎదురు చూస్తూ పోలీస్‌స్టేషన్ బయట ఇంకా కూర్చుని ఉన్నారు. అప్పటి వరకు కూర్చుని కూర్చుని వారి శక్తి కూడా ఉడిగిపోయింది. దానితో అందరూ కలిసి నీరసంగా బయటకు వచ్చారు.

అదే సమయంలో పరుగెత్తుతూ వస్తున్న నారాయణ ఆ ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడకు దగ్గరలో పోలీస్‌స్టేషన్ ఉందని తెలిసినా దాంట్లోకి వెళ్దామని అతను అనుకోవటం లేదు. ఒకసారి డబ్బుతో పోలీసుల కంటపడితే డబ్బూ దొరకదు, తనూ బయటకు రానని అతనికి తెలుసు.

అంతలో అతనికి దూరంగా రోడ్డు మీద పోలీస్ స్టేషన్ నుండి బయటకు వస్తున్న నరహరి బృందానికి చెందిన మనుషులు కనిపించారు. ఒకసారి వారి దగ్గరకు వెళ్ళగలిగితే ఇక తన ప్రాణాలకు ప్రమాదం ఉండదనుకున్నాడతను.

అతన్ని వెంటాడుతున్న మస్తాన్‌కి కూడా అదే ఊహ వచ్చింది. ఒకసారి నారాయణ అంతమంది మనుషుల మధ్యకు వెళ్తే ఇక తనేమీ చేయలేడు. అందుకే అతను శక్తినంతా కూడదీసుకుని పరుగెత్తుతున్నాడు.

రోడ్డంతా ప్రదర్శనకారులు విసిరిన రాళ్ళు పడి ఉన్నాయి. వాటిని చూసిన మస్తాన్ బుర్రలో ఒక ఆలోచన మెరిసింది. పరుగెత్తుతూనే వంగి ఒక రాయి తీసి నారాయణ మీదికి విసిరాడు. అది సూటిగా వెళ్ళి అతనికి తగిలింది.

అంతే! పెద్దగా ఆర్తనాదం చేస్తూ నారాయణ కూలిపోయాడు.

రెండు క్షణాల్లో అక్కడకు చేరుకున్న మస్తాన్ నారాయణ చేతిలో డబ్బు సంచి లాక్కోబోయాడు.

నారాయణ దెబ్బ వలన కిందపడ్డాడు. కానీ స్పృహ కోల్పోలేదు. పైగా అతని చేతిలో సగం పగిలిన సీసా ఇంకా అలానే ఉంది. ఆ విషయం మస్తాన్ గమనించలేదు. అతను గమనించేటప్పటికి సమయం మించిపోయింది. రగిలిపోతున్న కసినంతా చేతుల్లోకి తెచ్చుకుని ఆ సీసాని మస్తాన్ కడుపులోకి దించాడు నారాయణ.

మస్తాన్ కళ్ళు విప్పారంగా విచ్చుకున్నాయి. జరుగుతున్న విషయం నిజమని నమ్మలేనట్లు అతను తన గాయం వైపు

చూసుకున్నాడు. బుసబుస కడుపులో నుండి రక్తం పొంగుకు వస్తోంది. దానిని చూసుకున్న మస్తాన్‌కి తను బతకటం కష్టం అని అర్థమైంది. క్రోధం అంతా వెళ్ల గక్కుతూ నారాయణ మెడ మీద కాలు వేసి తొక్కాడు.

ఇద్దరి హాహాకారాలు దూరంగా వెళ్తున్న నరహరి మనుషులకు లీలగా వినిపించాయి. వెంటనే స్పందించిన వారు పరుగెత్తుకు వచ్చారు. అయితే వారు అక్కడకు వచ్చేటప్పటికే నారాయణ చనిపోయి ఉన్నాడు. మస్తాన్ కొన ప్రాణంతో కొట్టుకుంటున్నాడు. వారి చుట్టూ కొత్త వెయ్యి రూపాయల నోట్లు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి.

కన్ను మూసి తెరిచే లోపు ఆ నోట్లన్నీ నరహరి మనుషుల జేబుల్లోకి చేరాయి. వారి నిరుత్సాహపు మొహాల్లోకి కళ వచ్చింది. ఇంకా ప్రాణంతో ఉన్న మస్తాన్‌ని తరలించటానికి అంబులెన్స్‌కు ఫోన్ చేయబోయారు. అయితే వారికి ఆ శ్రమ కూడా తగ్గిస్తూ ఫోన్ కలవక ముందే మస్తాన్ ప్రాణం కూడా పోయింది.

ఇంతలో నరహరి కూడా అక్కడకు వచ్చాడు.

అప్పటికే గుంపులో ఒక వ్యక్తి చనిపోయిన వారిని గుర్తుపట్టాడు.

"ఎవర్రా వీళ్లు? " అన్న నరహరి ప్రశ్నలకు సమాధానంగా "వీడి పేరు మస్తాన్. దగ్గరలోనే ఉంటాడు. ఇంకొకడి పేరు సరిగ్గా తెలియదు. కానీ నారిగాడంటారు. వాడేమో గుడి దగ్గర అడుక్కుంటూ ఉంటాడు" వివరించాడు వారిని గుర్తుపట్టిన వ్యక్తి.

ఆ మాటలు విన్న నరహరి మొహంలో వింత వెలుగు ప్రవేశించింది.

★ ★ ★

ఆదిశేషు ప్రయాణిస్తున్న విమానం తెల్లవారుజామున ముంబయిలో దిగింది. మల్హోత్రాకి వాగ్దానం చేసిన ప్రకారం అతను స్వయంగా ముంబయి వచ్చాడు.

మల్హోత్రాకి ఎంత డబ్బు అవసరమో, అంత డబ్బు తన బ్యాంకు ఇవ్వగలదో, లేదో పరిశీలించటానికి అతను వచ్చాడు. ఈ విషయంలో మల్హోత్రా కంటే ఆదిశేషుకే ఆత్రుతగా ఉంది. ఒకసారి మల్హోత్రా సమస్యలు పరిష్కరించి ఫైనాన్స్ మినిస్టర్ చెప్పిన పని చేస్తే తన సమస్యల గురించి ఆయన పట్టించుకుంటాడు.

ఎయిర్‌పోర్ట్ బయటకు వచ్చిన అతనికి ఎప్పటిలా తన బ్యాంకు అధికారులెవరూ కనపడలేదు. అతను తన పర్యటనకు అనవసర ప్రచారం కల్పించదలుచుకోలేదు. అందుకే అక్కడకు ఒంటరిగా ఎవరికీ చెప్పకుండా వచ్చాడు. ఎదురుగా కనిపించిన టాక్సీ ఎక్కి కూర్చుని తను వెళ్ళవలసిన హోటల్ అడ్రస్ చెప్పాడు.

టాక్సీ బయలుదేరింది. వాన ఈడ్చి కొడుతోంది. గాలి రివ్వున వీస్తోంది.

"సాయంత్రం వరకు వాన పడినట్లు లేదు. ఇదేంటి ఇంత హఠాత్తుగా కాలం కాని కాలంలో వాన రావటం? " అన్నాడు ఆదిశేషు టాక్సీ డ్రైవర్‌తో.

"నిన్న సాయంత్రం నుండి చినుకులు మొదలయ్యాయి సర్! అరేబియా సము